జాతీయ తెలుగు దినపత్రిక


# ప్రజాజ్యోతి


ప్రతి అక్షరం ప్రజల కోసం

మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట

గురువారం, జూన్ 4, 2026 పేజీలు :13





## ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన

# బందోబస్తు

- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు



**మహబూబ్‌నగర్, జూన్ 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యవేక్షణలో ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు బుధవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి కరివేన రిజర్వాయర్, ఉదండాపూర్ రిజర్వాయర్ ప్రాంతాలను సందర్శించడంతో పాటు జడ్చర్ల పట్టణంలో నిర్వహించే ప్రజా సమావేశానికి హాజరుకానున్న నేపథ్యంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఓఎస్‌డీ కమలహాసన్ రెడ్డి, జోగులాంబ జోన్-7 డీఐజీ ఎల్.ఎస్. చౌహన్, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకి తదితరులు ఏర్పాట్లను సమీక్షించారు.

మొదట ఉదండాపూర్ రిజర్వాయర్ ప్రాంతాన్ని సందర్శించిన అధికారులు అక్కడ చేపట్టిన భద్రతా చర్యలు, పోలీసు సిబ్బంది మోహరింపు, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకల నియంత్రణ అంశాలను పరిశీలించారు. అనంతరం జడ్చర్లలో ఏర్పాటు చేస్తున్న ప్రజా సభా ప్రాంగణాన్ని సందర్శించి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణ, వీఐపీ భద్రత, అత్యవసర సేవల

# మానవపాడులో కొనసాగిన ప్రజా పాలన

-ప్రగతి నివేదిక బస్సు యాత్ర వందలాదిగా హాజరైన కాంగ్రెస్ శ్రేణులు



అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) జూన్ 03: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి చేపట్టిన ప్రజా పాలన ప్రగతి నివేదిక బస్సు యాత్ర రెండవ రోజు బుధవారం అలంపూర్ నియోజకవర్గంలోని మానవపాడు మండలంలో కొనసాగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు వందలాదిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలు లేకపోయినా

## కాంగ్రెస్ హామీల అమలుపై ప్రజల తరఫున

# ఒత్తిడి తీసుకురావాలి

కాంగ్రెస్ హామీల అమలుపై ప్రజల తరఫున ఒత్తిడి తీసుకురావాలి : మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్

- బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి





**మహబూబ్‌నగర్, జూన్ 3 ( ప్రజా జ్యోతి బ్యూరో )** బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్రంలోనే అత్యధికంగా నిర్వహించి పార్టీని

## పదో తరగతిలో 100% ఉత్తీర్ణతకు

# ప్రత్యేక కార్యాచరణ

- ఫిజిక్స్, ఇంగ్లీష్‌లో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక పుస్తకాల తయారీ
- ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు




**వనపర్తి, జూన్ 3 (ప్రజాజ్యోతి):** రాబోయే విద్యా సంవత్సరంలో జిల్లాలో పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పదో తరగతి ఫిజిక్స్,

# జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన

-సాగునీటి ప్రాజెక్టులపై సమగ్ర సమీక్ష

- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథక పనుల పరిశీలన

- సోమశిలలో బస.. ప్రాజెక్టుల పురోగతిపై ఉన్నతాధికారులతో సమావేశం,

-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



# జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన

నాగర్ కర్నూల్ మే3( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మితమవుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 4, 5 తేదీల్లో నాగర్‌కర్నూల్ జిల్లాలో రెండు రోజులపాటు విస్తృతంగా..పర్యటించనున్నారు. జిల్లాలోని ప్రధాన ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌లు, కాలువల నిర్మాణ పనులను పరిశీలించడంతో పాటు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాలునిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి, సాగునీటి రంగ బలోపేతానికి అత్యంత కీలకంగా భావిస్తున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం సహా వివిధ ప్రాజెక్టుల నిర్మాణ పురోగతి, పెండింగ్ పనులు, భవిష్యత్ కార్యాచరణపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు అధికారులు తెలిపారు.

సోమశిలలో బస.. ఉన్నతస్థాయి సమీక్ష

పర్యటనలో భాగంగా జూన్ 4న సాయంత్రం 6 గంటలకు ముఖ్యమంత్రి సోమశిల హెలిప్యాడ్‌కు చేరుకోనున్నారు. అనంతరం అక్కడి నుంచి సోమశిలలోని మృగవాని రిసార్ట్ గెస్ట్ హౌస్ కు చేరుకుని రాత్రి బస చేయనున్నారు.

సాయంత్రం 6.45 గంటల నుంచి రాత్రి 8.45 గంటల వరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కొనసాగుతున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో సాగునీటి శాఖ ఉన్నతాధికారులు, ప్రాజెక్టు ఇంజినీర్లు, జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొని ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, నిర్మాణ పురోగతి, నిధుల వినియోగం, పూర్తి చేయాల్సిన పనులపై ముఖ్యమంత్రికి నివేదిక అందించనున్నారు.

ఎల్లూరు పంప్‌హౌస్ నుంచి ప్రారంభమయ్యే పరిశీలన

జూన్ 5న ఉదయం 10.30 గంటలకు కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు పంప్‌హౌస్‌కు ముఖ్యమంత్రి చేరుకుంటారు. అక్కడ నుంచి ఉదయం 10.40 గంటల నుంచి 11.40 గంటల వరకు ప్రతిష్ఠాత్మక పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్) పరిధిలోని పలు కీలక నిర్మాణాలను పరిశీలించనున్నారు.

ఈ సందర్భంగా ప్యాకేజీ-3 హెడ్ రెగ్యులేటర్, ప్యాకేజీ-2 పరిధిలోని నార్లాపూర్ రిజర్వాయర్, ప్యాకేజీ-1 డెలివరీ సిస్టర్న్, అలాగే ఎంజీకేఎల్ఐఎస్ లిఫ్ట్-1 పంప్‌హౌస్‌ల నిర్మాణ పురోగతిని సమీక్షించనున్నారు. ప్రాజెక్టుల



నిర్మాణ నాణ్యత, సాంకేతిక అంశాలు, నీటి నిల్వ సామర్థ్యం, పనుల పూర్తి గడువులపై అధికారులను అడిగి తెలుసుకోనున్నారు.

ఏరియల్ వ్యూ ద్వారా కాలువలు, రిజర్వాయర్ల పరిశీలన అనంతరం ఉదయం 11.50 గంటలకు నార్లాపూర్ హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 12.20 గంటల వరకు ప్రాజెక్టు ప్రాంతాలను గగనతలం నుంచి పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా పీఆర్ఎల్ఐఎస్ ప్యాకేజీ-3 కాలువ పనులు, ఏదుల రిజర్వాయర్, పంప్‌హౌస్ నిర్మాణాలను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించనున్నారు.

కాలువల తవ్వకం, లైనింగ్ పనులు, రిజర్వాయర్ నిర్మాణం, అనుబంధ మౌలిక వసతుల పురోగతిని నేరుగా పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

వట్టెం రిజర్వాయర్ పనుల సమీక్ష మధ్యాహ్నం 12.20 గంటలకు కుమ్మెర హెలిప్యాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి, అక్కడి నుంచి పీఆర్ఎల్ఐఎస్ ప్యాకేజీ-8 స్టేజ్-3 పంప్‌హౌస్‌ను సందర్శించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు వట్టెం రిజర్వాయర్‌కు సంబంధించిన ప్యాకేజీలు 9, 10, 11 కింద జరుగుతున్న పనులను పరిశీలించనున్నారు.

పంప్‌హౌస్ నిర్మాణం, యంత్రాల ఏర్పాటు, నీటి సరఫరా వ్యవస్థ, రిజర్వాయర్ సామర్థ్యం, అనుబంధ కాలువల నిర్మాణంపై అధికారులతో చర్చించి పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది.సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా భావిస్తున్నపాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా దక్షిణ తెలంగాణలో లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి స్వయంగా ప్రాజెక్టు ప్రాంతాలను సందర్శించి పనుల పురోగతిని సమీక్షించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## కాంగ్రెస్ హామీల అమలుపై ప్రజల తరఫున ఒత్తిడి తీసుకురావాలి

మహబూబ్‌నగర్, జూన్ 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ) బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్రంలోనే అత్యధికంగా నిర్వహించి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు.

మాజీ హోం మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ, హైదరాబాద్‌కు సమాంతరంగా మహబూబ్‌నగర్ అభివృద్ధికి శ్రీనివాస్ గౌడ్ కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)పై పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు ప్రాణాలను పణంగా పెట్టారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా నేరాలను అదుపులో ఉంచామని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో నేర నియంత్రణలో విఫలమయ్యారని విమర్శించారు. తప్పుడు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు.

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై అన్ని వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ప్రజల తరఫున ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వెయ్యి పడకల ఆసుపత్రి, టూరిజం హోటల్‌ను పరిశీలించామని, అది రాజకీయాల కోసం కాదని స్పష్టం చేశారు. జిల్లా అభివృద్ధికి ఈ ఏడాది కీలకమని, వచ్చే ఏడాది ఎన్నికల వాతావరణం ప్రారంభమైతే నిధుల కేటాయింపులు తగ్గే అవకాశముందని పేర్కొన్నారు. అందువల్ల ఇప్పుడే ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చి అభివృద్ధి, సంక్షేమ హామీల అమలుకు నిధులు సాధించాలని అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. 2002 తరువాత ప్రస్తుతం ఓటరు జాబితా సవరణ జరుగుతోందని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా నాయకులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వాల్యా నాయక్, వెంకటేశ్వర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివరాజ్, మహబూబ్‌నగర్ మండల అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, హన్వాడ మండల అధ్యక్షుడు కరుణాకర్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు రెహమాన్, ఆంజనేయులు, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన బందోబస్తు

ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. తదుపరి కరివేన రిజర్వాయర్ ప్రాంతంలో పర్యటించిన అధికారులు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమీక్షించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర బందోబస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి భద్రతా పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి పోలీసు అధికారి అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. సభా ప్రాంగణాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.అనంతరం కరివేన ప్రాజెక్టు ప్రాంతంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులు బందోబస్తు ఏర్పాట్లపై చర్చించి సంబంధిత శాఖలకు తగిన సూచనలు జారీ చేశారు.

## పదో తరగతిలో 100% ఉత్తీర్ణతకు ప్రత్యేక కార్యాచరణ

ఇంగ్లీష్ సబ్జెక్టుల బోధనపై సంబంధిత ఉపాధ్యాయులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల విడుదలైన ఎస్సెస్సీ ఫలితాలను విశ్లేషిస్తూ పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, గత విద్యా సంవత్సరంలో గణితంలో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక పుస్తకాన్ని రూపొందించి బోధించడం ద్వారా మంచి ఫలితాలు సాధించామని గుర్తు చేశారు. అదే విధానాన్ని ఈసారి ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లోనూ అమలు చేయాలని సూచించారు. ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ప్రాథమిక అంశాలతో ప్రత్యేక పుస్తకాలను రూపొందించాలని, వాటి తయారీని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ముందుగా పదో తరగతి విద్యార్థులకు సులభ పరీక్ష నిర్వహించి ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిని గుర్తించాలని సూచించారు. విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించే పుస్తకాల ఆధారంగా ప్రాథమిక స్థాయి నుంచి బోధన అందించి సబ్జెక్టులపై పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. ఫిజిక్స్, ఇంగ్లీష్‌తో పాటు అన్ని సబ్జెక్టుల్లోనూ ఒక్క విద్యార్థి కూడా అనుత్తీర్ణుడు కాకుండా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సమావేశంలో గణిత, ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మానవపాడులో కొనసాగిన ప్రజా పాలన

ప్రజల సమస్యలను తెలుసుకోవడం,ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడం కోసం మండలాల వారీగా బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలను తెలుసుకుంటున్నామని అన్నారు.అలంపూర్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీని,ఎంపీ మల్లు రవిని ఆదరించి గెలిపించినందుకు కృతజ్ఞతగా ఎంపీ నిధుల నుంచి అభివృద్ధి పనులకు అధిక నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు.తాను ఎన్నికల్లో ఓడిపోయినా నియోజకవర్గ ప్రజలు అభివృద్ధిలో వెనుకబడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నిధులుతీసుకువస్తున్నామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో వేలాది ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుందని, రైతులు,పేదలు, మహిళల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజలు తప్పుడు ప్రచారాలను నమ్మకుండా అభివృద్ధిని గుర్తించి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు.

అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ బస్సు యాత్ర ముందుకు సాగింది.

ఈ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి,గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు,నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి మధు,జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్,అలంపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుమార్, మానవపాడు మండల అధ్యక్షుడు జగన్ మోహన్ నాయుడు,పల్లి సతీశ్ రెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మన ఊరిలో ఒక్కరు కూడా బడిబయట ఉండరు

**బడిబాట ప్రతిజ్ఞ సింగారం గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి ప్రభుత్వ పాఠశాలలు ముద్దు ప్రైవేట్ పాఠశాలలు వద్దు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి**






**నారాయణపేట ప్రతినిధి జూన్ 03 ప్రజా జ్యోతి**

తేదీ 3 6 2026 బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం సింగారం గ్రామాన్ని పర్యటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సింగారం గ్రామపంచాయతీ లో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి మరియు ఉప సర్పంచ్ లక్ష్మణ్ గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామసభలో మాట్లాడుతూ విద్యార్థులను తప్పకుండా ప్రతి తల్లిదండ్రులు పాఠశాలకు పంపాలని విద్యార్థులు చదివినచో ఎంతో ఉన్నత స్థానానికి ఎదుగుతారని మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో విశాలమైనటువంటి గదులు అన్ని వసతులు తో ఉన్నాయని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తే ప్రతి విద్యార్థికి రెండు జతల దుస్తులను పాలు రాగిజావ రుచికరమైనటువంటి మధ్యాహ్న భోజనము ఉచిత పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ ప్రభుత్వ పాఠశాలలో అందిస్తారు నేడు ప్రైవేట్ పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ఉంటాయని కాబట్టి ప్రతి తల్లిదండ్రులు తప్పకుండా ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలియజేశారు గ్రామ సభలో బడిబాట ప్రతిజ్ఞను విద్యార్థి తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి మాట్లాడుతూ మా పాఠశాలలో శిక్షణా పొందినటువంటి ఉపాధ్యాయులు ఉన్నారని ఈ పాఠశాలలో రోబెటిక్ శిక్షణ సైన్స్ ల్యాబ్ కరాటే ప్రతి విద్యార్థి పైన ప్రత్యేకమైన శ్రద్ధ వహించి వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని కాబట్టి మీ పిల్లలు మా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల సింగారం ప్రధానోపాధ్యాయులు జయప్రకాష్ నాయక్ మరియు ఉపాధ్యాయులు భీమప్ప దత్తాత్రేయ భాస్కర్ సాయప్ప పాల్గొన్నారుజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రతాప్ మధుసూదన్ భాను ప్రకాష్ లక్ష్మణ్ నరసింహ నర్సింలు రఘురాంరెడ్డి నిర్మల శశిరేఖ శ్రీదేవి శిరీష ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# కొంకలలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం



**వడ్డేపల్లి జూన్ 03(ప్రజా జ్యోతి):**

అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండలం కొంకల గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు,అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డెప్పతో కలిసి బుధవారం లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు.రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని సూచించారు.కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను రైతులు తప్పనిసరిగా పాటించాలని కోరారు.ఎకరానికి గరిష్టంగా 10 క్వింటాళ్ల చొప్పున జొన్నలను సేకరిస్తామని అధికారులు తెలిపారు.ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతం జొన్నల్లో ఉండాలని,తాలు,మట్టి లేకుండా శుభ్రంగా ఉంచాలని రైతులకు సూచించారు.పంట విక్రయానికి వచ్చే రైతులు పట్టాదారు పాస్‌బుక్,ఆధార్ కార్డు,బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని అధికారులు తెలిపారు.పంటకు సంబంధించిన చెల్లింపులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయబడతాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారులు,మండల స్థాయి అధికారులు,ప్రజాప్రతినిధులు,రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి బహిరంగ లేఖ

నారాయణపేట ప్రతినిధి జూన్ 03 (ప్రజా జ్యోతి) విషయం నారాయణపేట జిల్లా కేంద్రంలోనే పూర్తి స్థాయి వైద్య సేవలను పునరుద్ధరించి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని బలోపేతం చేయాలని విజ్ఞప్తి. మీరు నారాయణపేట జిల్లాకు విచ్చేస్తున్న సందర్భంగా జిల్లా ప్రజల తరపున ఈ బహిరంగ లేఖ రాస్తున్నాను. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. మరోవైపు, జిల్లా కేంద్ర ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన వైద్య సేవలను పట్టణానికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాల (మెడికల్ కాలేజీ) పరిధిలోకి తరలించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, ప్రమాదాల్లో గాయపడిన బాధితులు మరియు అత్యవసర వైద్య సేవలు అవసరమైన పేద ప్రజలు జిల్లా కేంద్రం నుండి దూరంగా ఉన్న ఆసుపత్రికి చేరుకోవడానికి తీవ్ర కష్టాలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ దూరం ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది.జిల్లా ఏర్పడిన తర్వాత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆశించినప్పటికీ, ప్రస్తుతం జిల్లా కేంద్రంలో పూర్తి



స్థాయి ప్రభుత్వ ఆసుపత్రి లేకపోవడం ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జిల్లా ఆసుపత్రిని బలోపేతం చేయడం, అవసరమైన వైద్యులు మరియు సిబ్బందిని నియమించడం, అత్యవసర సేవలు, ప్రసూతి సేవలు, ట్రామా కేర్ వంటి సేవలను జిల్లా కేంద్రంలోనే అందుబాటులో ఉంచడం అత్యంత అవసరం.ఈ సమస్యపై మేము పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాము. నారాయణపేట జిల్లా కేంద్రంలోనే వైద్య సేవలు పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సుమారు 2000 మంది ప్రజలతో భారీ ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పించాము. అదేవిధంగా ప్రజల వైద్య హక్కులు హరించబడుతున్నాయనే అంశంపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్కు ఫిర్యాదు చేయగా, కమిషన్ కేసు నమోదు చేసి సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసిన విషయం ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నాము.అందువల్ల, మీరు నారాయణపేట జిల్లా పర్యటన సందర్భంగా:నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిని వెంటనే పునరుద్ధరించాలి.

జిల్లా కేంద్రంలోనే పూర్తి స్థాయి వైద్య సేవలను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులో ఉంచాలి. గర్భిణీలు, వృద్ధులు మరియు ప్రమాద బాధితుల కోసం ప్రత్యేక అత్యవసర వైద్య విభాగాలను ఏర్పాటు చేయాలి.జిల్లా ఆసుపత్రిలో అవసరమైన వైద్యులు, నర్సులు మరియు సిబ్బందిని నియమించాలి.ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని శాశ్వత పరిష్కారం చూపాలి.ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం మరియు మానవ హక్కులకు సంబంధించిన ఈ సమస్యను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

# ఘనంగా వేసవి శిక్షణ తరగతుల ముగింపు వేడుకలు

## – ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు

మహబూబ్‌నగర్, జూన్ 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహబూబ్‌నగర్ నగరంలోని టీచర్స్ కాలనీ కమలా గార్డెన్‌లో శ్రీ వైష్ణవి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న చిన్నారులు సాంస్కృతిక, శాస్త్రీయ నృత్యాలలో విశేష ప్రతిభ కనబరిచారని అభినందించారు. చిన్న వయసులోనే కళల పట్ల ఆసక్తి పెంపొందించుకోవడం వారి భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. వేసవి శిక్షణలో భాగంగా శిక్షణ పొందిన చిన్నారులు అద్భుతమైన నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లాసికల్ డాన్సర్ విజయలక్ష్మి, శ్రీ శాంత గ్రామర్ స్కూల్ ప్రిన్సిపల్, గోల్డ్ రాజు, చిన్నారుల తల్లిదండ్రులు మరియు కళాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కళలను ప్రోత్సహిస్తూ చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసే ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరమని పలువురు అభిప్రాయపడ్డారు.





# బ్రాహ్మణ సంఘం చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ ను సన్మానించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**నాగర్ కర్నూల్ : జూన్ 03 (ప్రజా జ్యోతి)**

హైదరాబాద్ పట్టణంలోని కోఠీ ప్రాంతంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘం పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ ను నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి,పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.అనంతరం ఎమ్మెల్యే
రాజేష్ రెడ్డి మాట్లాడుతూ బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి,సంక్షేమానికి ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని,సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని అన్నారు.కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు,ప్రజా ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

# యువత చదువుతో పాటు క్రీడలలో రాణించాలి

## -మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర



నాగర్ కర్నూల్ : జూన్ 03 (ప్రజా జ్యోతి)
యువత చదువుతో పాటు క్రీడలలో రాణించాలని నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ అన్నారు.బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన తైక్వాండో కలర్ బెల్ట్ టెస్టులో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ పాల్గొన్నారు.పంచులు,బ్లాక్స్,కిక్స్,స్టాండ్స్,పుంసే,ఫైట్,కర్ర సాము ఇతర విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి 23 ఎల్లో బెల్ట్ లు,12 ఎల్లో వన్ బెల్టులు,3గ్రీన్ బెల్టులు,2 గ్రీన్ వన్ బెల్టుల సాధించారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్,కౌన్సిలర్ నిజాముద్దీన్ చేతుల మీదుగా బెల్టులు,ధ్రువపత్రాలు అందజేసారు.అనంతరం మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర,జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలని క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మ రక్షణ,నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని,క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో , నంది వడ్డేమాన్ మాజీ ఎంపిటిసి యాదగిరి,జిల్లా జిల్లా తైక్వాండో ప్రెసిడెంట్ డాక్టర్ తెప్ప శ్రీనివాస్,జిల్లా జనరల్ సెక్రెటరీ రవికుమార్,జిల్లా ట్రెజరర్ మాస్టర్ స్వాతితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విత్తనాల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాలి

**-ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణాలలోనే విత్తనాలను కొనాలి**
**-జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు**



నాగర్ కర్నూల్ : జూన్ 03 (ప్రజా జ్యోతి)
రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో విత్తనాల చట్టం-1966 నిబంధనలను పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.యశ్వంత్ రావు సూచించారు. ముఖ్యంగా పత్తి విత్తనాలు కొనుగోలు చేసే రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని తెలిపారు.బుధవారం జిల్లా కేంద్రంలో సాయిరాం ట్రేడర్స్,ఆనంద్ కిసాన్ తో పాటు పలు విత్తన దుకాణాలను తనిఖీ చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన సంచులపై కంపెనీ పేరు, హైబ్రిడ్ రకం,లాట్ నంబర్,మొలక శాతం,స్వచ్ఛత శాతం,ప్యాకింగ్ తేదీ,గడువు తేదీ వివరాలను రైతులు తప్పనిసరిగా పరిశీలించాలని,సీల్ చెదరని సంచులను మాత్రమే కొనుగోలు చేయాలని,ప్రభుత్వ అనుమతి లేని దీ+-×××/సుదీ పత్తి విత్తనాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు.ప్రతి విత్తన సంచిలో కొంత నమూనా విత్తనాన్ని భద్రపరచుకోవాలని,విత్తే ముందు మొలక పరీక్ష నిర్వహించాలని విత్తనాల నాణ్యత లోపాలు,మొలక సమస్యలు తలెత్తితే వెంటనే వ్యవసాయాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని,పంట కోత వరకు విత్తన సంచులు,ట్యాగులు,కొనుగోలు రసీదులు భద్రంగా ఉంచుకోవాలని నకిలీ లేదా లేబుల్ లేని విత్తనాల విక్రయాలను గమనించిన వెంటనే వ్యవసాయ శాఖకు సమాచారం అందించాలని సూచించారు.అదేవిధంగా వర్షం పడి నేల పూర్తిగా తడిసిన అనంతరం,భూమిలో 9 నుంచి 12 అంగుళాల మేర తేమ ఉన్నప్పుడే విత్తనాలు విత్తుకోవాలనిరైతులకు సూచించారు.బిల్లు,విత్తన సంచి,ట్యాగ్, నమూనా విత్తనం భద్రపరిస్తేనే నాణ్యత సమస్యల పై పరిహారం పొందడం సులభమవుతుందన్నారు.

# తెలకపల్లిలో టాస్క్ ఫోర్స్ తనిఖీలు

**-విత్తనాలు,పురుగుమందుల దుకాణాల పరిశీలన**



నాగర్ కర్నూల్ : జూన్ 03 (ప్రజా జ్యోతి)
నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలోబుధవారం మండల వ్యవసాయ అధికారి నర్మదఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.తనిఖీలలో విత్తనాలు, పురుగుమందులు,ఎరువుల దుకాణాలను,శతాక్షిట్రేడర్స్,మన గ్రోమోర్ కేంద్రం,ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాలలో తనిఖీలు చేసి దుకాణాల లైసెన్సులు,ధ్రువీకరణ పత్రాలు,స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి రికార్డులను నిబంధనల ప్రకారం నిర్వహించాలని,ధ్రువీకరించిన కంపెనీ విత్తనాలనే రైతులకు విక్రయించాలని,నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందేలా చూడాలన్నారు.ఈ తనిఖీలో ఎస్సై ఎం.రమేష్ పాల్గొన్నారు.

# ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్‌కు ఘన సన్మానం



జడ్చర్ల, జూన్ 3 (ప్రజా జ్యోతి): నారాయణపేటలో నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర శిక్షణ తరగతులకు హాజరయ్యేందుకు వెళ్తున్న సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్‌కు జడ్చర్ల పట్టణంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అడ్వకేట్ డాక్టర్ కొంగళి శ్రీకాంత్ నివాసానికి విచ్చేసిన క్రాంతి కిరణ్‌ను డాక్టర్ కొంగళి శ్రీకాంత్, కుటుంబ సభ్యులు, కొంగళి మోహనరాజ్ ఆధ్వర్యంలో శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి, శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు. అనంతరం భగవాన్ బుద్ధుని చిత్రపటాన్ని స్మారక కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతి కిరణ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ఎస్సీ మోర్చా కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా టౌన్ అధ్యక్షుడు జగదీష్, నాయకులు రాజు, శ్రీనివాస్, పలువురు ముఖ్య నాయకులు, డాక్టర్ కొంగళి శ్రీకాంత్ కుటుంబ సభ్యులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని పిలుపు

దేవరకద్ర, జూన్ 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ) దేవరకద్ర నియోజకవర్గంలోని కొత్తకోట పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన డిజిటల్ సభ్యత్వ నమోదు మరియు ఎస్ఐఆర్‌పై అవగాహన కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, నిరంజన్ రెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు పల్లె రవి, వెంకటేశ్వర్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి మెట్టు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీలో గ్రూపులు, వర్గాలు లేవని, అందరూ కే. చంద్రశేఖర్ రావు టీమ్‌గా పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆదేశాలను ప్రతి కార్యకర్త కచ్చితంగా పాటించాలని, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుకుగా పనిచేయాలని సూచించారు. పార్టీ ఇంచార్జిలతో సమన్వయం చేసుకుంటూ మండల స్థాయి టీంలు అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ పార్టీ అని పేర్కొన్న ఆయన, మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేయడానికి ఐకమత్యంతో కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ, దీనిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటరు జాబితా సవరణపై ప్రజల్లో అవగాహన పెంచాలని అన్నారు.కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందని పేర్కొన్న ఆయన, పదేళ్ల పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల్లో ఉన్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు ఓటు వేశారని, కానీ రెండున్నర ఏళ్లలోనే అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎన్నికల హామీల అమలును కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు.
కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని కార్యకర్తలకు సూచించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు.



# ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు హరిబాబునుసన్మానించిన మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్

నాగర్ కర్నూల్ : జూన్ 03 : (ప్రజా జ్యోతి)
నాగర్ కర్నూల్ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలో అధ్యక్షుడిగా ఎన్నికైన బిల్లకంటి హరిబాబు ను మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర,వైస్ చైర్మన్ బాధం రమేష్ తో పాటు ప్రజా ప్రతినిధులు,నాయకులు సన్మానించారు.అనంతరం వారు మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం మరింత అభివృద్ధి చెందాలని అందుకు మా సహకారం ఉంటుందని అన్నారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు పడిగె శంకర్,శ్రీను,ఖాజాఖాన్,సంతోష్,ఆర్యవైశ్య సంఘం సభ్యులు, పాల్గొన్నారు.



# తెలంగాణ ప్రజల మనోభావాలను అవమానిస్తే సహించం

## - ప్రాంతీయవాదాన్ని ఉగ్రవాదంతో పోల్చడం దురదృష్టకరం
## - కేసీఆర్ సంక్షేమ పాలన దేశానికే ఆదర్శం: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



వనపర్తి, జూన్ 3 (ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాన్ని ప్రాంతీయవాదంగా చిత్రీకరించడం సరికాదని, తెలంగాణ ప్రజల మనోభావాలను కించపరిస్తే సహించబోమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. దేవరకద్ర నియోజకవర్గ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం ఇంచార్జి ఆల వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించగా, ముఖ్య అతిథిగా పాల్గొన్న నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అనేక మంది యువత ఆత్మబలిదానాలు, ప్రజల దీర్ఘకాల పోరాట ఫలితంగా ఆవిర్భవించిందన్నారు. అలాంటి ఉద్యమాన్ని ప్రాంతీయవాదంగా అభివర్ణించడం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్య అని విమర్శించారు. పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం చేసిన ఆత్మత్యాగాన్ని ప్రాంతీయవాదంగా పరిగణిస్తే, అలాంటి వ్యాఖ్యలు చేసే వారే ప్రజల భావోద్వేగాలను అవమానిస్తున్నట్లవుతుందని అన్నారు. తెలంగాణ ప్రజలు వివక్ష, నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారని పేర్కొన్నారు.

కేసీఆర్ పాలన దేశానికి ఆదర్శం

మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచాయని నిరంజన్ రెడ్డి అన్నారు. రైతు బంధు, రైతు బీమా, కంటి వెలుగు, కేసీఆర్ కిట్, సాగునీటి ప్రాజెక్టులు వంటి పథకాలు తెలంగాణ అభివృద్ధికి దోహదపడ్డాయని చెప్పారు.

కాంగ్రెస్ హామీల అమలులో వైఫల్యం

ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆయన ఆరోపించారు. ధాన్యం కొనుగోలు, రైతు సంక్షేమం, నిరుద్యోగుల ఉపాధి, మహిళల ఆర్థిక సహాయం తదితర అంశాల్లో ప్రజలు నిరాశ చెందారని విమర్శించారు. తగిన సమయంలో ప్రజలే తమ తీర్పు ఇస్తారని అన్నారు.

సభ్యత్వ నమోదు యజ్ఞంలా నిర్వహించాలి

బీఆర్ఎస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని యజ్ఞంలా నిర్వహించాలని నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలతో మమేకమై పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ హోంమంత్రి మహమూద్ పాషా, రాష్ట్ర కార్యదర్శి మెట్టు శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు పల్లె రవి తదితరులు పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వం రైతు, వ్యవసాయ వ్యతిరేక విధానాలకు నిరసనగా జూన్ 8 వరకు మండల డివిజన్ జిల్లా కార్యాలయం ముందు ధర్నాలను జయప్రదం చేయండి

**నారాయణపేట ప్రతినిధి జూన్ 03 (ప్రజా జ్యోతి)**




ఈరోజు నారాయణపేట జిల్లా కేంద్రంలో భగత్ సింగ్ భవన్లో అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు భగవంతు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి రాము హాజరై కార్యక్రమం కరపత్రం విడుదల చేయడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) జాతీయ మహాసభల పిలుపులో భాగంగా మోడీ ప్రభుత్వం రైతు వ్యవసాయ వ్యతిరేక విధానాలకు నిరసనగా జూన్ 1 నుండి 8 వరకు మండల డివిజన్ జిల్లా కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహించాలన్నారు. పచ్చిమాసియా సంక్షోభాన్ని సాకువ చూపుతూ మోడీ ప్రభుత్వం భారతీయ రైతాంగానికి, ప్రజలకు తక్కువ ఎరువులు వంట నూనెలు గ్యాస్ పెట్రోల్ డీజిల్ తక్కువ వాడాలని పెళ్లి పేరంటాలకు బంగారం కొనుగోలు చేయవద్దని వర్క్ ఫ్రం హోమ్ చేయాలని అనేక ఇతర సలహాలను ఇచ్చింది. పెట్రో ఉత్పత్తుల ధరలను కేవలం 11 రోజుల్లో లీటర్ కు ఎన్ని రూపాయలు పెంచింది అన్నదాతలైన రైతంగంతో సహా శ్రమజీవులు అయిన ప్రతి విభాగం తీవ్ర సంక్షోభంలో ఉన్నప్పుడు ప్రజల ముఖ్యంగా రైతాంగం భుజాలపై భారాన్ని తగ్గించాల్సింది పోయి రైతు ఉత్పత్తులకు అవసరమైనటువంటి ఎరువులు విత్తనాలు ధరలు పెంచి విపరీతమైన బారాలను మోపుతుందన్నారు. ప్రభుత్వం పెట్రో ఉత్పత్తులపై ఉన్న అన్ని పన్నులు శిష్యులను ఎందుకు ఉపసహరించుకోవడం లేదు ఇతర దేశాలైన జర్మనీ బ్రిటన్ ఆశ్చర్య ఇటలీ ఐలాండ్ వంటి అనేక దేశాలు ఎక్కువ ఉత్పత్తులపై ధరలు తగ్గించడానికి రాయితీలు ఇస్తుంటే "విశ్వగురువు" మాత్రం ప్రజల భుజాలపై భారాల మీద భారాలు ఎందుకు మోపుతున్నారు. 2020 నుండి 25 వరకు ఈ ఐదేళ్లలో కేవలం పన్నులు షెడ్యూలు విధించడం ద్వారా మోడీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు ఏకంగా 36 లక్షల 85 వేల కోట్ల రూపాయల భారాన్ని రైతాంగం పై మోపాయన్నారు . రైతు వ్యతిరేక కార్పొరేట్ అనుకూల గ్రామీణ సంపన్న వర్గాల అనుకూల విధానానికి తక్షణమే ఉపసవరించుకోవాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం నిస్సందేహంగా డిమాండ్ చేస్తున్నది దీనికోసం దేశ వ్యాప్తంగా బలీయమైన రైతు ఉద్యమం ఒకటే ప్రత్యమ్ మాయం ఈ వారం రోజులు అఖిలభారత నిరసన కార్యక్రమం రాబోయే అఖిలభారత ఉమ్మడి ఫలియమైన కార్యక్రమానికి ప్రాథమిక సన్నాహం కావాలన్నారు. ఈ అఖిలభారత నిరసన కార్యక్రమం విజయవంతం కావడానికి దేశ రహితంగా హృదయపూర్వకంగా మద్దతు ఇవ్వాలని ఏఐయుకేఎస్ జాతీయ కమిటీ విజ్ఞప్తి చేస్తుంది ఈ పిలుపులు పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్రంలో జూన్ 1 నుండి 8 వరకు జరిగే ధర్నా కార్యక్రమాలను రైతాంగం అధికం మొత్తంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి యాదగిరి, ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి, కృష్ణ, సహాయ కార్యదర్శిలు కొండ నరసింహులు, నారాయణ, ఏ రాములు, సభ్యులు చంద్రములు ఆనంద్ తాయప్ప సుభాష్ తదితరులు పాల్గొన్నారు

## 108 మాత శిశు అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ

నారాయణపేట ప్రతినిధి జూన్ 03 (ప్రజా జ్యోతి)



నారాయణపేట జిల్లా ఆసుపత్రి దగ్గర ఉండే ప్రభుత్వ 108 మాతా శిశువు అంబులెన్స్ ను ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రవికుమార్ గారు ఆకస్మిక తనిఖీ చేశారు, తనిఖీలో భాగంగా ఉద్యోగుల పనితీరు, జిల్లా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు మరియు అంబులెన్స్ లో ఉండే మందులు మరియు రికార్డులను పరిశీలించి, అత్యవసర సమయంలో అంబులెన్సులు ఆక్సిజన్ ఉంచుకోవాలని మరియు గోల్డెన్ అవర్ లోపు ప్రమాద బాధితులను ప్రభుత్వ హాస్పిటల్ చేర్చాలని, 108 సిబ్బందికి తగు సూచనలు చేశారు, ఆయన వెంట జిల్లా మేనేజర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు

# జడ్చర్లకు సీఎం రేవంత్ రెడ్డి రాక.. సభ ఏర్పాట్ల పరిశీలన

## గంగాపూర్ రోడ్డులో సభా స్థలాన్ని తనిఖీ చేసిన మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



**జడ్చర్ల, జూన్ 3 ( ప్రజా జ్యోతి ):**

జూన్ 5న జడ్చర్ల పట్టణ పర్యటనకు రానున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి , జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కలిసి పరిశీలించారు. గంగాపూర్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న సభా ప్రాంగణాన్ని మంగళవారం సందర్శించి ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సభా వేదిక, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీటి సరఫరా, విద్యుత్ సదుపాయాలు, భద్రతా చర్యలు తదితర అంశాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధికి మరింత ఊతమివ్వనుందని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే అవకాశంగా ఈ పర్యటన నిలుస్తుందని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్త, జిల్లా ఎస్పీ జానకి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధి లక్ష్యంగా కొత్త సాంకేతిక కోర్సులు

## కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, జూన్ 3 (ప్రజాజ్యోతి): చదువుకున్న ప్రతి విద్యార్థికి ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో పలు సంస్కరణలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు తప్పనిసరిగా పాలిటెక్నిక్ లేదా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాశాఖ అంశాలు, డిగ్రీ--పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యార్థుల నమోదుపై రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం నుంచి డిప్లొమా ఇన్ సెమీకండక్టర్ టెక్నాలజీ, సివిల్ ఇంజినీరింగ్--రియల్ ఎస్టేట్ టెక్నాలజీ, ల్యాండ్‌స్కేప్ డిజైన్, మల్టీమీడియా అండ్ ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ వంటి ఉపాధి ఆధారిత కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తిచేసిన ప్రతి విద్యార్థి, ముఖ్యంగా బాలికలు ఉన్నత విద్యను కొనసాగించేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. బడి బాట కార్యక్రమం ద్వారా బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడైనా కొరత ఉంటే వెంటనే ప్రతిపాదనలు పంపాలని మండల విద్యాధికారులకు సూచించారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లా మంచి ప్రతిభ కనబర్చిందని, ఆ విషయాన్ని ప్రజల్లో ప్రచారం చేసి ప్రభుత్వ పాఠశాలల్లో నమోదులు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో జరిగే గ్రామసభల్లో ప్రధానోపాధ్యాయులు పాల్గొని ప్రభుత్వ పాఠశాలల సౌకర్యాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. అపార్ ఐడీ జనరేషన్, యూడైస్ అప్‌డేషన్, ఆధార్ వెరిఫికేషన్ పనులను వేగవంతం చేయాలని, ఏఐ తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలల్లో కంప్యూటర్లు, ఇంటర్నెట్ సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, ఇంటర్మీడియట్ విద్యాధికారి నరేందర్ కుమార్, పాల్గొన్నారు.



# ఫ్రీ ప్రైమరీ పీఎం శ్రీ కేంద్రాలను రద్దుచేసి అంగన్వాడి కేంద్రాలకు అప్పజెప్పాలి

### సీఐటీయూ జిల్లా నాయకులు బండపల్లి శివరాములు

**వంగూరు జూన్ 3 (ప్రజా జ్యోతి)**

రాష్ట్ర ప్రభుత్వం చిన్నారులకు విద్యా బోధన బోధన కోసం చేపడుతున్న ఫ్రీ ప్రైమరీ పీఎం శ్రీ కేంద్రాలను తక్షణమే రద్దు చేసి అంగన్వాడీ కేంద్రాలకు అప్ప చెప్పాలని సిఐటియు జిల్లా నాయకులు బండపల్లి శివ రాములు డిమాండ్ చేశారు. బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండల కేంద్రంలో నీ వంగూరు గ్రామ సర్పంచ్ పురుగుల యాదయ్య కు అంగన్వాడి టీచర్లు ఆయాల సమస్యల పైన అంగన్వాడీ టీచర్లతో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం శివరాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చిన్న పిల్లలకు యూకేజీ విద్యా బోధన పేరుతో ఫ్రీ ప్రైమరీ పీఎం శ్రీ పాఠశాలను ఏర్పాటు చేసి టీచర్లను ఆయాలను నియమించడానికి ప్రత్యేకంగా 4, 1 31 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.అట్టి కేంద్రాలను అంగన్వాడీ కేంద్రాలకు అప్పజెప్పాలని లేకపోతే అంగన్వాడి వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఆయన ఆరోపించారు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడీ టీచర్లు ఆయాలకు కనీస వేతనాలు చెల్లించకపోవడం వలన కుటుంబాలు ఎన్నో ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు .రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీ ప్రైమరీ పీఎం శ్రీ కేంద్రాలను ఏర్పాటు చేస్తే అడ్డుకోవడానికి అంగన్వాడీ టీచర్లు ఆయాలు సిద్ధం కావాలని ఆయన అన్నారు. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఫ్రీ ప్రైమరీ పీఎం శ్రీ కేంద్రాలను రద్దు చేయడానికి ప్రభుత్వాలపైన వత్తిడి తీసుకురావడానికి దశల వారి పోరాట కార్యక్రమాలను రూపొందించడం జరిగిందని అన్నారు అంగన్వాడీ టీచర్లు



ఆయాలు అప్రమత్తంగా ఉండి ఫ్రీ ప్రైమరీ పీఎం శ్రీ కేంద్రాలను అంగన్వాడి కేంద్రాలకు అప్పజెప్పేవరకు పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు.అంగన్వాడీ టీచర్లు ఆయాలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ప్రతినెల 1వ తేదీన వేతనాలు ఇవ్వాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని ,రిటైర్మెంట్ బెనిఫిట్స్ రెండు లక్షలు ఇవ్వాలని బిఎల్ఓ డ్యూటీలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్వాడి టీచర్ల ఆయాల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వంగూరు మండల కార్యదర్శి శ్రీ కుమారి (శిరీష) మండల నాయకురాలు లక్ష్మమ్మ టీచర్లు, నిర్మల రహేన జుమాలి తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల ప్రాణాలతో చెలగాటమా?..

### ఎస్ఎన్ఎస్ స్టార్చ్ యాజమాన్యంపై సోమనాద్రి మండిపాటు



**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) జూన్ 03:**

భద్రత గాలికొదిలిన ఎస్ ఎన్ ఎస్ స్టార్చ్ కంపెనీ?మైనర్ బాలుడు తీవ్రంగా గాయపడటంపై సోమనాద్రి పోతురాజు ఆగ్రహం.ఇటిక్యాల మండలం సాతర్ల గ్రామానికి చెందిన అజయ్,జింకలపల్లి పరిధిలోని ఎస్ ఎన్ ఎస్ స్టార్చ్ లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తుండగా బుధవారం ప్రమాదవశాత్తు కన్వేయర్ బెల్ట్‌లో కాలు చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డాడు.ప్రస్తుతం అతను కర్నూలులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సోమనాద్రి పోతురాజు కర్నూలులోని రేణుక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు.అజయ్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని,కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ ఎన్ ఎస్ స్టార్చ్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం కార్మికుల భద్రత విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.కంపెనీలో సరైన భద్రతా ప్రమాణాలు అమలు చేయకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు.

అలాగే గాయపడిన అజయ్ మైనర్ బాలుడని బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం అత్యంత తీవ్రమైన అంశమని ఈ ఘటనపై కార్మిక శాఖ, ఫ్యాక్టరీల శాఖతో పాటు సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు.

# అలంపూర్ అభివృద్ధే లక్ష్యం

### వల్లూరు మల్లమ్మకుంట పూర్తి చేయడం కాంగ్రెస్ బాధ్యత:సంపత్ కుమార్

**వడ్డేపల్లి జూన్ 03(ప్రజా జ్యోతి):**

నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ పార్లమెంటు పరిధిలో నిర్వహిస్తున్న"ప్రజా పాలన ప్రగతి నివేదిక"బస్సు యాత్రలో భాగంగా రెండో రోజు వడ్డేపల్లి మండలంలోని శాంతినగర్ పట్టణ కేంద్రంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ బస్సు యాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ,గత ఎన్నికల్లో టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్)నాయకులు ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినప్పటికీ,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలుగా కొనసాగుతూ ప్రజా సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు.తాను ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు అత్యంత సన్నిహితుడు కావడం వల్ల అలంపూర్ నియోజకవర్గంలోని ప్రతి పేదవారికి న్యాయం చేయగలుగుతున్నానని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంతకాలం అలంపూర్ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.రాజకీయాల్లోకి తాను స్వలాభం కోసం రాలేదని,ప్రాంత అభివృద్ధి మరియు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే తన లక్ష్యమని చెప్పారు.గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన వల్లూరు మల్లమ్మకుంట సహా పలు నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేసి,ఆర్డీఎస్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.అలంపూర్ నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని,రానున్న రోజుల్లో మరిన్ని ఇళ్లను మంజూరు చేసి పూరిగుడిసెలు లేని గ్రామాలుగా అలంపూర్‌ను





తీర్చిదిద్దాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు,ఉచిత విద్యుత్,గ్యాస్ సబ్సిడీ,రైతు భరోసా,ఎస్సీ కార్పొరేషన్ రుణాలు,మహిళలకు వడ్డీ లేని రుణాలు,పెట్రోల్ బంకుల నిర్వహణలో అవకాశాలు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా బస్సు యాత్ర కొనసాగుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రమోద్ కుమార్,డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి,వడ్డేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి,పట్టణ అధ్యక్షుడు చిన్ని బాబు,ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు దేవేంద్ర, మహిళా నాయకురాలు నాగశిరోమణి,మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప,వైస్ చైర్మన్ పర్వర్ల కుమార్,రాజోలి సర్పంచ్ గంగిరెడ్డి,ఎల్లారెడ్డి జగన్ గౌడ్,యోగి రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు,మహిళలు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే మీ పిల్లలను చేర్పించండి

### మీ కష్టం డబ్బులు వృధా చేసుకోకండి...మండల విద్యాధికారి...

**కొల్లాపూర్ జూన్ 3 ప్రజా జ్యోతి**

కొల్లాపూర్ మండల పరిధిలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న బడుగు బలహీన వర్గాల పేద ప్రజల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి మీ భవిష్యత్తును మార్చుకోండి తల్లిదండ్రుల కష్టాన్ని ప్రైవేటు పాఠశాలలకు వృధా చేయకండి. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలోభాగంగా ర్యాలీగా తిరిగి బడిబాట ప్రతిజ్ఞ కార్యక్రమం విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపిన మండల విద్యాధికారి. కొల్లాపూర్ మండలంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర నిర్వహించనైనది ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించే విధంగా తల్లిదండ్రులు చర్య తీసుకోవాలని అదేవిధంగా పిల్లలలో దాగి ఉన్న వైయుక్తిక ప్రతిభ పాట వాళ్లని స్వేచ్ఛ వాతావరణంలో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యతతో కూడిన విద్యను అభివృద్ధి పరచి, పౌరులుగా తీర్చిదిద్దే ఆశయము తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము విద్యాశాఖ పై బాధ్యత నిలిపిన కారణంగా, ప్రతి విద్యార్థికి నిర్మాణాత్మకమైన నాణ్యమైన విద్య అందించే విధంగా ఈ బడిబాట కార్యక్రమము నిర్వహిస్తున్నామని మండల విద్యాధికారి వివరించారు. కొల్లాపూర్ రూరల్ లో వున్న పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులందరూ బడిబాట కార్యక్రమము నిర్వహించి ఇట్టి కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గర్ల్స్ హెచ్ఎం శోభారాణి వారి ఉపాధ్యాయబృందం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర పాఠశాలలో బృందం. వారితోపాటు ఆర్ ఐ డి గౌట్ హెచ్ఎస్, ఏ ఏ పి సి చైర్మన్, రిటైర్డ్ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే ఆర్ ఐ డి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ బృందం ఎంపీ యుటిఎస్ సోమశిల పాఠశాల పరిధిలో ఉన్న ఇండ్లకు వెళ్లి ఆర్ ఐ డి గౌట్ కొల్లాపూర్ పాఠశాలలో చేరాలని మండల విద్యాధికారి విజ్ఞప్తులు చేశారు.



# గద్వాలలో మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు

**గద్వాల (ప్రజా జ్యోతి) జూన్ 03:**

భారత రాష్ట్ర సమితి డిప్యూటీ ఫ్లోర్ లీడర్,మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు గద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి మాజీ మంత్రి జన్మదిన సందర్భంగా,కేక్ కట్ చేసి,జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.హరీష్ రావు జన్మదిన సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని బాసు హనుమంతు నాయుడు ప్రారంభించారు.

అనంతరం గద్వాల నియోజకవర్గ ప్రజల తరఫున హరీష్ రావుకి జన్మదిన శుభాకాంక్షలు హనుమంతు నాయుడు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగర్ దొడ్డి వెంకట్రాములు, వెంకటేశ్వర రెడ్డి, జి.రాఘవేంద్ర రెడ్డి, బీచుపల్లి,పటేల్ జనార్దన్ రెడ్డి,వెంకటేష్ నాయుడు,కౌన్సిలర్లు నర్సింహులు,మోహన్ యాదవ్,రామకృష్ణ,చిత్తరి కిరణ్,శేఖర్ నాయుడు,జాంపల్లి భరత్ సింహారెడ్డి, శ్రీరాములు,తిమ్మప్ప గౌడ్,వెంకటేష్ యాదవ్,మద్దిలేటి,డ్యామ్ శ్రీను,రఘు నాయుడు,మాలిక్,కృష్ణ,చాకలి శ్రీనివాసులు,వినయ్, నరసింహులు,గోవిందు, వీరేష్,భాస్కర్,మహేందర్,నరేష్ మరియు పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జూన్ 4, 5 న ఉమ్మడి మహమూబ్ నగర్ జిల్లాలో పర్యటించనున్న సీయం రేవంత్ రెడ్డి

## ఏర్పాట్లపై మంత్రి జూపల్లి సమీక్ష.. హెలిప్యాడ్‌ను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు..





**కొల్లాపూర్ జూన్ 3 ప్రజా జ్యోతి జూన్ 3..**

ఉమ్మడి పాలమూరు జిల్లా నీటిపారుదల ప్రాజెక్టులను వేగవంతం చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి జూన్ 4, 5 తేదీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు పలు ఎత్తిపోతల పథకాలు రిజర్వాయర్లు పంప్‌హౌస్‌లను పరిశీలించడంతో పాటు అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. ఏర్పాట్ల పరిశీలన... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో నేపథ్యంలో జడ్చర్లలోని కల్వకుర్తి ఎక్స్ రోడ్ వద్ద హెలిప్యాడ్ భద్రతా ఏర్పాట్లను ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో కలిసి పర్యాటక సాంస్కృతిక ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. గంగాపూర్ ఏరియా ఆసుపత్రి వద్ద బహిరంగ సభ ఏర్పాట్లను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. జన సమీకరణపై సన్నహాక సమావేశం అనంతరం సీయం సభకు జనసమీకరణపై మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులతో సన్నహాక సమావేశం నిర్వహించారు. జనసమీకరణను నాయకులు ప్రజాప్రతినిధులు బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. అందరి లక్ష్యం సీయం సభను విజయవంతం చేయడమేనని స్పష్టం చేశారు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు బాధ్యతలు తీసుకుని పార్టీ శ్రేణుల సమన్వయంతో సీయం రేవంత్ రెడ్డి పర్యటను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీయం రేవంత్ రెడ్డి పర్యటనలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యాటక సంస్కృతి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాటికి శ్రీహరి, తెలంగాణ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి తదితరులు పాల్గొంటారు. ముఖ్యమంత్రి పర్యటన సాగనుందిలా... జూన్ 4 (గురువారం) మధ్యాహ్నం 3 గంటలకు నారాయణపేట జిల్లా మక్తల్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 గంటల వరకు మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం (ఎంఎన్‌కేఎల్‌ఐఎస్), భీమా, కృష్ణా నదులపై ప్రతిపాదిత బ్యారేజీల పనుల పురోగతిని అధికారుల వివరిస్తారు. తర్వాత మధ్యాహ్నం 3.40 - నుంచి 4 గంటల వరకు మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలిస్తారు. సాయంత్రం 4.10 గంటలకు మక్తల్ హెలిప్యాడ్ కు చేరుకుంటారు అనంతరం సాయంత్రం 4.10 గంటలకు కోయిల్‌సాగర్ ప్రాజెక్టు, కృష్ణా-భీమా నదులపై ప్రతిపాదిత బ్యారేజీలు, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు డ్యామ్ ప్రాంతాన్ని ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించనున్నారు. సాయంత్రం 4.50 గంటలకు జోగులాంబ గద్వాల జిల్లా ధారూర్ మండలం గూడెందొడ్డి హెలిప్యాడ్‌కు చేరుకుని స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం సాయంత్రం 4.55 గంటల నుంచి 5.30 గంటల వరకు గూడెందొడ్డి రిజర్వాయర్, జేఎన్‌ఎల్‌ఐఎస్ స్టేజ్-1 పంప్‌హౌస్‌ను పరిశీలిస్తారు. అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 6 గంటలకు సోమశిల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. సాయంత్రం 6.45 గంటల నుంచి రాత్రి 8.45 గంటల వరకు మృగవాణి రిసార్ట్ రివర్‌ఫ్రంట్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. జూన్ 5న ఉదయం 9.45 గంటలకు కొల్లాపూర్‌లోని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నివాసంలో బ్రేక్ ఫాస్ట్. అనంతరం ఉదయం 10.30 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు పంప్‌హౌస్‌కు చేరుకుంటారు. ఉదయం 10.40 గంటల నుంచి 11.40 గంటల వరకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్‌ఎల్‌ఐఎస్) ప్యాకేజీ-3 హెడ్ రెగ్యులేటర్, ప్యాకేజీ-2 నార్లాపూర్ రిజర్వాయర్, ప్యాకేజీ-1 డెలివరీ సిస్టర్న్, ఎంజీకేఎల్‌ఐఎస్ లిఫ్ట్-1 పంప్‌హౌస్‌లను పరిశీలిస్తారు. ఉదయం 11.50 గంటలకు నార్లాపూర్ హెలిప్యాడ్ నుంచి బయలుదేరి పీఆర్‌ఎల్‌ఐఎస్ ప్యాకేజీ-3 కాలువ పనులు, ఏదుల రిజర్వాయర్, పంప్‌హౌస్ పనులను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12.20 గంటలకు కుమ్మెర హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు పీఆర్‌ఎల్‌ఐఎస్ ప్యాకేజీ-8 స్టేజ్-3 పంప్‌హౌస్, వట్టెం రిజర్వాయర్‌కు సంబంధించిన ప్యాకేజీ - 9, 10, 11 పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కొత్తూర్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 2.10 గంటల నుంచి 2.30 గంటల వరకు పీఆర్‌ఎల్‌ఐఎస్‌కు చెందిన కరివేన రిజర్వాయర్ ప్యాకేజీ- 14, 15 పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 4.30 గంటల వరకు మీడియా సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. అనంతరం సాయంత్రం 5 గంటలకు జడ్చర్ల మండలం ఉదండాపూర్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. సాయంత్రం 5.10 గంటల నుంచి 5.40 గంటల వరకు పీఆర్‌ఎల్‌ఐఎస్‌కు చెందిన ఉదండాపూర్ రిజర్వాయర్ ప్యాకేజీలు 17, 18 పనులను పరిశీలిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు ఉదండాపూర్ సభా ప్రాంగణానికి చేరుకుంటారు సాయంత్రం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సభ అనంతరం రాత్రి 7.30 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరనున్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా లో పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

కొల్లాపూర్ జూన్ 3 ప్రజాజ్యోతి


నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గం కొల్లాపూర్ మండలం సోమశిల నార్లాపూర్ ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలించినభద్రత, బస, హెలిప్యాడ్, సమీక్షా సమావేశ ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు.జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్,తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల సందర్శన నిమిత్తం ఈ నెల 4, 5 తేదీల్లో రెండు రోజుల పాటు పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపడుతోంది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌తో కలిసి కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సోమశిల, నార్లాపూర్ ప్రాంతాలతో పాటు పర్యాటక అభివృద్ధి ప్రాంతాలను సందర్శించి ముందస్తు ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.మొదట సోమశిలలోని హరిత గెస్ట్ హౌస్‌ను సందర్శించిన అధికారులు, ముఖ్యమంత్రి బస చేయనున్న గదులు సమావేశ మందిరాలు విశ్రాంతి సదుపాయాలు తాగునీరు విద్యుత్ పారిశుధ్య ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యమంత్రి పాల్గొనే ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టుల సమీక్షా సమావేశం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ముఖ్యమంత్రి పర్యటనకు అత్యంత ప్రాధాన్యత ఉన్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా పరిశీలించారు. హరిత గెస్ట్ హౌస్ పరిసర ప్రాంతాలు ప్రవేశ మార్గాలు పార్కింగ్ ప్రాంతాలు సమావేశ ప్రాంగణంలో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు. పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ముఖ్యమంత్రి హెలికాప్టర్ రాకపోకల దృష్ట్యా ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్ స్థలాన్ని కూడా పరిశీలించిన అధికారులు, అక్కడ భద్రత ట్రాఫిక్ నియంత్రణ వాహనాల పార్కింగ్ ప్రజల రాకపోకల నిర్వహణకు సంబంధించిన చర్యలపై సూచనలు చేశారు. హెలిప్యాడ్ నుంచి పర్యటన ప్రాంతాలకు వెళ్లే రహదారుల మరమ్మతులు, శుభ్రత పనులను వెంటనే పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ శాఖ అధికారులను ఆదేశించారు.అనంతరం నార్లాపూర్‌లోని పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్యాకేజీ--3 పనులను పరిశీలించారు. ముఖ్యమంత్రి ఈ పర్యటనలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ స్టేజ్--3 పనులను ప్రత్యక్షంగా పరిశీలించనున్న నేపథ్యంలో అక్కడి పనుల పురోగతి సందర్శన ఏర్పాట్లు భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించారు.

. అనంతరం కుమ్మెర ప్రాంతంలోని పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను సందర్శించి సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌సీ పార్థసారథి, ఆర్డీఓ బన్సీలాల్, నాగర్‌కర్నూల్ ఆర్డీఓ సురేష్‌బాబు, డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ మాధవి, నాగర్‌కర్నూల్ తహసీల్దార్ తబితా రాణి, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీధర్‌తో పాటు పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఎస్సీ సంక్షేమ శాఖలో అదనపు బాధ్యతలు చేపట్టిన రవీందర్ రెడ్డి



**చిన్నంబావి, జూన్ 3 (ప్రజాజ్యోతి):** కొప్పునూర్ వసతిగృహ సంక్షేమ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వనపర్తి, కొత్తకోట ప్రాంతాల ఇన్‌చార్జి ఎస్సీ అభివృద్ధి అధికారిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ వసతిగృహాల విద్యార్థుల సంక్షేమంతో పాటు స్కాలర్‌షిప్‌ల పర్యవేక్షణ, కులాంతర వివాహాలు చేసుకున్న ఎస్సీ యువతకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు మంజూరు అయ్యేలా విచారణలు నిర్వహించి సిఫారసులు చేయడం వంటి బాధ్యతలు నిర్వర్తిస్తానని తెలిపారు. అలాగే వసతిగృహాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలు, అవసరమైన సరుకుల కొనుగోలు, ఇతర మౌలిక అవసరాల కోసం బడ్జెట్ మంజూరుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపనున్నట్లు చెప్పారు. దళిత విద్యార్థులు, ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా ప్రత్యేక కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన పెంపొందించుకొని అర్హులైన ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి కొత్త బాధ్యతలు చేపట్టినందుకు కార్యాలయ సిబ్బంది, జిల్లా వ్యాప్తంగా ఉన్న వసతిగృహ సంక్షేమ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## ఉపాధి హామీ కూలీలకు పూర్తి కూలీ చెల్లించాలి



**గద్వాల (ప్రజా జ్యోతి) జూన్ 03:**

గద్వాల మండలం గోనుపాడు గ్రామంలో ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిశీలించిన సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేర్ నరసింహ, కొలతలతో సంబంధం లేకుండా ప్రతి కూలీకి ప్రభుత్వం నిర్ణయించిన రూ.307 కూలీతో పాటు రూ.20 కరువు భత్యం చెల్లించాలని డిమాండ్ చేశారు.మూడు నెలలుగా కూలీ బిల్లులు పెండింగ్‌లో ఉండటం, తక్కువ కూలీ జమ కావడం,తాగునీరు, ఓఆర్ ఎస్ ప్యాకెట్లు వంటి సౌకర్యాలు లేకపోవడం, జాబ్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయకపోవడం వంటి సమస్యలను కూలీలు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు.అనంతరం గోనుపాడు గ్రామ వ్యవసాయ కార్మిక సంఘం కన్వీనర్‌గా వెంకటేష్,కో-కన్వీనర్‌గా బలరాం,కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భాష, రంజాన్ బి,చంద్రమ్మ, దౌలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రింగ్ మేస్త్రీల న్యాయమైన డిమాండ్లకు సంపూర్ణ మద్దతు

**నారాయణపేట ప్రతినిధి జూన్ 03 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా కేంద్రంలో సెంట్రింగ్ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మె కార్యక్రమానికి సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు ఎం. కాళేశ్వర్, కె. కాశీనాథ్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమానికి సెంట్రింగ్ మేస్త్రీల సంఘం అధ్యక్షులు డి. బాబు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నిర్మాణ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న సెంట్రింగ్ మేస్త్రీలు మరియు కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిర్మాణ సామగ్రి ధరలు, జీవన వ్యయం రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ కార్మికుల కూలి రేట్లు అందుకు అనుగుణంగా పెరగకపోవడం వల్ల వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ మేస్త్రీల సంఘం అధ్యక్షులు డి బాబు, ఉపాధ్యక్షులు కే లక్ష్మణ్ , గౌరవ అధ్యక్షులు దండు ఉషణ్ణ, కార్యదర్శి బండి నరసింహ, కోశాధికారి నరేష్ , కార్యదర్శి కే లక్ష్మణ్ , గౌరవ ఉపాధ్యక్షులు మల్లప్ప తో పాటు సభ్యులు, సెంట్రింగ్ మేస్త్రీలు,నిర్మాణ రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకటరామిరెడ్డి, మడివాల కృష్ణ మద్దతు తెలిపారు

